# తలనీలాల కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు

- ఐదు నెలలుగా బకాయిలు
- 4కోట్ల విలువైన చెక్కుల బౌన్స్
- కోర్టు మెట్లెక్కిన ఆలయ అధికారులు
- క్రిమినల్ కేసుతోపాటు కోర్టుకు హాజరుకావాలని ఆదేశం



రాజన్న ఆలయం కల్యాణకట్టలో తలనీలాల మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, అక్టోబర్ 15: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌పై న్యాయ స్థానంలో క్రిమినల్ కేసు నమోదైంది. 2023-25 రెండేండ్లకుగాను తలనీలాల సేకరణకు ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురానికి చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు నాగరాజు రూ.19 కోట్లకు టెండర్ దక్కించుకున్నాడు. తొలుత రూ.50 లక్షలు డిపాజిట్ చేసి, ప్రతి నెలా రూ.79,17,000 చెల్లించేందుకు 24 చెక్కులను ఆలయ అధికారులకు అందజేశాడు. ఏప్రిల్ 2024 వరకు రూ.8,92,04,500 చెక్కుల ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఆ మరుసటి నెల నుంచి వేసిన రెండు చెక్కులు బ్యాంకులో నగదు నిల్వ లేక బౌన్స్ కాగా, అప్పటినుంచి కాంట్రాక్టర్‌కు తలనీలాల సరఫరాను నిలిపివేసి, అధికారులే భద్రపరుస్తున్నారు. చెక్కులు బౌన్స్ కావడంతో న్యాయవాది ద్వారా కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపగా, ఆయన స్పందించలేదు. దీంతో అధికారులు ఈ నెల 9న వేములవాడ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా వచ్చే నెల 13న హాజరు కావాలని కోర్టు ఆదేశించినట్టు అధికారులు తెలిపారు. అయితే మరో మూడు చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయని, బకాయిలు రూ.4 కోట్లకు చేరిన నేపథ్యంలో మరో కేసు కూడా వేస్తామని అధికారులు చెబుతున్నారు.

## కొండగట్టు ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

మల్యాల, అక్టోబర్ 15: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రం జూనియర్ అసిస్టెంట్ కూరగాయల రాములును మంగళవారం సస్పెండ్ చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు తెలిపారు. నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన 50 కేజీల బియ్యం, సరుకులను పక్కదారి పట్టించాడన్న ఆరోపణలపై విచారణ చేశామని చెప్పారు. సీసీ కెమెరాలు పరిశీలించడంతోపాటు బియ్యాన్ని తరలించిన ఓ గ్యాస్ ఏజెన్సీకి చెందిన డెలివరీ బాయ్ సురేశ్ స్టేట్‌మెంట్‌ను తీసుకున్నామని, పూర్తి ఆధారాలు దొరకడంతో రాములును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.

## రాష్ట్రంలో నేడు, రేపు వానలు

- **వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ అంతటా వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీంతో వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్‌తో పాటు నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని కేంద్రం తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఏపీలో తుఫాను ముప్పు పొంచి ఉన్నట్టు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే అప్రమత్తమైన టీటీడీ.. బుధవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది.

*ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలలో రూ.500 ఆలస్య రుసుముతో, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ కళాశాలల్లో ఆలస్య రుసుము లేకుండా ప్రవేశాలు కల్పించాలని తెలంగాణ ఇంటర్ బోర్డు, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించింది.*

















